చేరువైన వైద్యం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్) :



రోగలకు మందులు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

- సురక్ష శిబిరాలతో కార్పొరేట్ తరహా సేవలు
- వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేత
- పేదల వైద్యానికి భరోసా అంటూ ప్రజల హర్షం

మచిలీపట్నంటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యరంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు వరంగా మారాయి. పేదలతోపాటు అన్నివర్గాల ప్రజలు శిబిరాల్లో పాల్గొని వైద్య సేవలు పొందుతున్నారు. శిబిరాలకు హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. వీరిలో అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు పెద్దాస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసి శిబిరాల్లో ఇప్పటివరకు వేలాదిమంది రోగులు వైద్యసేవలు పొందారు. ఈ ఉచిత శిబిరాల్లో పలు విభాగాలకు చెందిన వైద్యులు వైద్య సేవలు అందించారు.

కార్పొరేట్ తరహాలో రోగి ఫైల్..

ఆన్‌లైన్‌లో రోగి పూర్తి వివరాలను క్రోడీకరించి ఫైల్‌ను అందజేస్తున్నారు. అనంతరం రోగికి అవసరమైన మందులను ప్రత్యేక సంచిలో వేసి ఇస్తున్నారు. మందులు, రిపోర్టులు రోగులు జాగ్రత్త చేసుకునేందుకు గానూ ఇవి పంపిణీ చేస్తుండటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

42 డివిజన్లలో 8,858 మందికి వైద్య సేవలు..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరంలోని 42 డివిజన్లలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. శిబిరాలకు ఇప్పటి వరకు 8,858 మంది రోగులు వచ్చి వైద్యసేవలు పొందారు. ఇంకా 8 డివిజన్లలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో సాయంత్రం పూట వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు.

వైద్య శిబిరాల్లో వసతులు..

వైద్య శిబిరానికి వస్తున్న రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఏర్పాట్లు చేయించారు. వైద్య శిబిరం ఏర్పాటైన ప్రాంతాల్లో విశాలమైన టెంట్లు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. అలాగే రెండు, మూడు ప్రాంతాల్లో చల్లని తాగునీటిని ఏర్పాటు చేశారు. వచ్చిన వారందరికీ బిస్కెట్ ప్యాకెట్లు, అల్పాహారం అందించారు.

మందులు ఉచితంగా ఇచ్చారు



నడుం నొప్పితో చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నా. వైద్య శిబిరానికి వచ్చి డాక్టర్‌కు చూపించుకున్నా. పరీక్షలు చేసి మందులు రాశారు. మందులను ఉచితంగా ఇచ్చారు. వైద్యశిబిరం వద్ద ఏర్పాట్లు బాగున్నాయి.

–అరుణకుమారి, శివగంగ

ఎంఆర్ఐ తీయించుకోమన్నారు



నాలుగేళ్ల కిందట విద్యుత్ షాక్‌తో పడిపోయాను. తలకు నేల దెబ్బ తగిలి తలనొప్పి వస్తోంది. తగ్గడం లేదు. వైద్య శిబిరానికి వచ్చి డాక్టర్‌కు చూపించుకుంటే మందులు రాశారు. పెద్దాస్పత్రికి వెళ్లి ఎంఆర్ఐ తీయించుకోమని చెప్పారు. మందులు, చీటీలు పోకుండా ఫైల్, సంచి ఇవ్వడం ఉపయోగకరంగా ఉంది.

– కొక్కిలిగడ్డ మరియమ్మ, శారదా నగర్

పౌష్టికాహారంపై అవగాహన..

మహిళల్లో అధికశాతం మంది రక్తహీనతతో బాధపడుతుంటారు. దీనిని ఎలా అధిగమించాలనే అంశంపై ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. పలు రకాల పిండి వంటలను శనగలు, రాగి జావ, పప్పుఉండలు, ఆకుకూరలతో వివిధ రకాల పదార్థాలు తయారుచేసి ప్రదర్శనకు ఉంచి వీటిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. శిబిరానికి వచ్చిన అతిథులకు ఈ ఆహార పదార్థాలను రుచి చూపిస్తున్నారు.

357 మందికి వైద్య సేవలు



రోగులకు మందులు అందజేస్తున్న అచ్యుతరావు, రామానాయుడు

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు చేరువయ్యాయని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. బుధవారం పెడన మండలం పుల్లపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, పెనుమల్లి సర్పంచ్ గరికపాటి వెంకట రామానాయుడు, ఎంపీడీఓ రెడ్డయ్య తదితరులు శిబిరాన్ని ప్రారంభించారు. 357 మందికి వైద్య నిపుణులు ప్రదీప్‌కుమార్, సౌజన్య, మీనా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఆరుగురిని వివిధ శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు దిశ సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన గురువారం జరుగుతుందని కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశపుహాల్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఎంపీ బాలశౌరిని కలిసిన ఆర్డీఓ వాణి



అవనిగడ్డ: మచిలీపట్నం నూతన ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఎం. వాణి బుధవారం ఎంపీ వల్లభనేని బాలశౌరిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నాగాయలంకలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆర్డీఓ వాణి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. స్వామివారి ఆస్థాన మండపంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు దీవి నరసింహమూర్తి భక్తులచే సత్యనారాయణస్వామి వ్రత పూజలు చేయించారు. సత్యనారాయణస్వామి వ్రత మహాత్యాన్ని వివరించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు–అన్నపూర్ణ దంపతులు స్వామివారికి పూజా సామగ్రిని ఉచితంగా అందించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావు నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రసన్న భక్తాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఉదయం జరుగుతుందని కమిటీ పెద్దలు తెలిపారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేశామని చెప్పారు.

శాంతాదేవీకి కుంకుమ పూజలు



బంటుమిల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయంలో అమ్మవారికి బుధవారం శాంతాదేవీ పుష్పశయన అలంకారంలో కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రికి స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీ రామపురం గ్రామంలో దేవీశరన్నవరాత్రి మండపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

మచిలీపట్నంటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం రాత్రి స్థానిక ఆజాద్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వేదమంత్రోచ్చరణలతో మార్మోగింది. వేద పండితులు విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, సభ్యులు పర్యవేక్షించారు.

బైక్ దగ్ధం



మోపిదేవికాలనీ(మోపిదేవి): మోపిదేవి కాలనీ వద్ద బుధవారం ద్విచక్రవాహనం దగ్ధమైంది. గుంటూరు జిల్లా తురకపాలెంకు చెందిన సిద్ధార్థ మోపిదేవి బంధువుల ఇంటికి వచ్చారు. జాతీయ రహదారిపై ఆగిఉన్న వాహనం ఇంజిన్ నుంచి పొగలు వ్యాపించడంతో సిద్ధార్థ దూరంగా వాహనం వదిలి వెళ్లాడు. వెనువెంటనే మంటలు వ్యాపించి వాహనం పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.

27న అరుణాచలానికి ప్రత్యేక బస్ సర్వీస్

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి శుక్రవారం ప్రత్యేక ఆర్టీసీ సర్వీస్‌ను నడుపుతామని డిపో మేనేజర్ హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు అవనిగడ్డ నుంచి బయలు దేరి రేపల్లె, భట్టిప్రోలు, చందోలు, బాపట్ల మీదుగా అరుణాచలానికి ఈ సర్వీసు వెళుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముఖ్యమైన ఘటనలు వెంటనే తెలియజేయండి

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎక్కడైనా ముఖ్యమైన ఘటనలు జరిగితే వెంటనే తనకు తెలియజేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ భవనాల ప్రారంభం, ఓటర్ల జాబితా, జగనన్న ఆరోగ్య సురక్ష, ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలపై దాడులు, మృతుల వంటి ముఖ్యమైన ఘటనలు జరిగినప్పుడు సంబంధిత ఎంపీడీఓలు, తహసీల్దార్లు వెంటనే ఆ సమాచారాన్ని తెలియజేయాలన్నారు. జిల్లాలో ఏదైనా ప్రభుత్వ శాఖ ప్రత్యేకించి ఇంజినీరింగ్ అధికారులు వారి పరిధిలో ప్రజాప్రతినిధులు పాల్గొనే భవన ప్రారంభోత్సవ వివరాలను ముందుగా కలెక్టరేట్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ నెల 27వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలు ఏఈఆర్‌ఓలు కలెక్టరేట్‌కు వచ్చి తీసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులకు అప్పగించి 27వ తేదీన ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రచురించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి వారి నుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు.

ఓటర్ల జాబితాపై ఇచ్చిన దరఖాస్తులను నవంబర్ 20వ తేదీలోగా అప్‌డేట్ చేయాలన్నారు. మచిలీపట్నం నగరంలో రహదారులపై ఎట్టి పరిస్థితుల్లో పశువులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభంకానున్న దృష్ట్యా వీటిపై సమగ్ర ప్రణాళిక అమలు చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పి. రోజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేద్దాం

గూడూరు ఎంపీపీ మధుసూదనరావు



మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు కోరారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగింది. వివిధ శాఖల పురోగతిని సమీక్షించారు. గండ్రం సర్పంచి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పాలుపోత దశలో ఉన్న వరిపంటకు నీటి ఎద్దడి సమస్య వల్ల తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అధికారులు కాలువలకు నీరు విడుదల చేయాలని ఆయన కోరారు. మల్లవోలు శివారు ముదిరాజుపాలెం మండల పరిషత్ పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని సర్పంచి బొర్రా సాంబశివయ్య కోరారు. దీనిపై స్పందించిన ఎంపీపీ వెంటనే అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారి లోయ హరిబాబును ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా ప్రజాప్రతినిధులను కలుపుకుని వెళ్లాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, వివిధ గ్రామల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలి



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, కమిటీ సభ్యులు

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులను ప్రోత్సహించాలని, ఇందుకు షాపింగ్ కాంప్లెక్స్ ఆదాయ వనరు అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో సుమారు 150 షాపులు ఉన్నాయని, కొత్తగా 12 షాపులు నిర్మించామని చెప్పారు. ఈ స్టేడియం ద్వారా క్రీడలు ప్రోత్సహించడానికి ప్రభుత్వానికి భారం కాకూడదనే సంకల్పంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు స్టేడియం నిర్మించారన్నారు. క్రీడల ప్రోత్సాహానికి నిధులు వేరే మార్గం నుంచి అందుబాటులో ఉండవు కనుక షాపులపై వచ్చే అద్దెలను క్రీడల ప్రోత్సాహానికి వినియోగిస్తున్నామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, కార్యవర్గ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య తదితరులు చేసిన కృషి అభినందనీయం అన్నారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు రామ్‌ప్రసాద్, సయ్యద్ గఫార్, రేమల్లి నీలాకాంత్, అలీబేగ్ పాల్గొన్నారు.

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

పెదపారుపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోలీసు అమరవీరుల దినోత్సం సందర్భంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పల్లా నాగకల్యాణి విద్యార్థులకు పోలీసుల పని తీరును వివరించారు. అనంతరం పోలీసులు రైఫిల్‌ను ఏ సమయంలో ఉపయోగించాలో, దానిని ఎలా వాడాలో వివరించారు. ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో ఎమర్జెన్సీ సమయంలో ప్రతి పౌరుడు ఒక సైనికుడిలా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

30 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పామర్రు: నియోజకవర్గ పరిధిలో 30 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7.19 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం బాధితులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తులు చేయించామన్నారు. స్పందించిన ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మున్నంగి సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా అమ్మవారి నిమజ్జనాలు



చల్లపల్లి రైతుబజారు దుర్గమ్మ నిమజ్జన ఉత్సవం



మోపిదేవిలో దుర్గామాత ఊరేగింపు



నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న అమ్మవారు



బంటుమిల్లి మండలం ఆర్తమూరులో అమ్మవారి గ్రామోత్సవం

గూడూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గూడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ నిమజ్జనాలు బుధవారం కోలాహలంగా సాగాయి. గూడూరులోని గాంధీ బొమ్మసెంటర్, సామాజిక ఆరోగ్య కేంద్రం సెంటర్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా పురవీధుల్లోకి వచ్చిన అమ్మవారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. యువకులు కేరింతలు కొడుతూ డీజే వాయిద్యాల మధ్య అమ్మవారిని రామరాజు పాలెం కాలువలో నిమజ్జనం చేశారు.

- **అవనిగడ్డ:** నవరాత్రులు సందర్భంగా స్థానిక రెండో వార్డులో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారిని బుధవారం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను ప్రత్యేక వాహనంలో ఉంచి ఊరేగించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి నీళ్ల వార పోసి పూజలు చేశారు.
- **చల్లపల్లి:** రైతుబజారులో పది రోజుల పాటు పూజలు అందుకున్న దుర్గమ్మ విగ్రహ నిమజ్జన కార్యక్రమం బుధవారం సాయంత్రం కోలాహలంగా జరిగింది. కూరగాయల రైతులు, డ్వాక్రా స్టాల్స్ వారి ఆధ్వర్యంలో రైతుబజారు ఎస్టేట్ అధికారి లంకె బలి చక్రవర్తి పర్యవేక్షణలో రైతుబజారులో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం డప్పు వాయిద్యాలు, శాకంబరీ మహిళా కోలాట బృందం కోలాట ప్రదర్శనతో సందడిగా నిమజ్జన కృష్ణానదికి నిమజ్జనానికి తరలించారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

కృష్ణమ్మ చెంతకు చేరిన దుర్గమ్మ

మోపిదేవి: దసరా ఉత్సవాల సందర్భంగా మోపిదేవిలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారికి 11 రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఉంచి డప్పు కళాకారుల సందడి, యువకుల కేరింతల మధ్య గ్రామంలో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు హారతి పట్టారు. సాయంత్రం మోపిదేవి వార్పు వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు మొదటిదశ పరిశీలన కార్యక్రమాన్ని కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం సాయంత్రం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల పరిశీలన కార్యక్రమం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరగాలని, పార్టీ ప్రతినిధులంతా తప్పక హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. గుర్తింపుకార్డులు లేకుండా అనుమతించేది లేదన్నారు. భద్రత సిబ్బంది పరిశీలన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు డీపీఓ నాగేశ్వరనాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సురేష్, డీటీ శ్యామ్ నాథ్ పాల్గొన్నారు.

వీఆర్‌కి మోపిదేవి ఎస్ఐ పద్మ

మోపిదేవి: మోపిదేవి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ పద్మ వీఆర్‌కు వెళ్లారని చల్లపల్లి సీఐ నాగప్రసాద్ గురువారం తెలిపారు. ఇటీవల కె. కొత్తపాలెంలో ఎస్టీ మహిళపై జరిగిన దాడిలో ఎస్ఐ దురుసుగా వ్యవహరించినట్లు ఆమె ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు వీఆర్‌కు వెళ్లగా, ఆమె స్థానంలో ఘంటసాల ఎస్ఐ కె. శ్రీనివాసరావును ఇన్‌చార్జిగా నియమించారని సీఐ నాగప్రసాద్ తెలిపారు.

గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాల ప్రారంభం



సచివాలయ భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చెప్పారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో రూ.65 లక్షలు వెచ్చించి నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే గడచిన నాలుగున్నరేళ్లలో ప్రజలకు ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా సీఎం జగనన్న నెరవేర్చారన్నారు. విపత్తుల వలన పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవడంతో పాటు ఆర్‌బీకేల ద్వారా విస్తృత సేవలు అందించటం జరుగుతోందన్నారు.

టీడీపీ విష ప్రచారం..

టీడీపీ సాగిస్తున్న విష ప్రచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్కిల్ స్కాంలో రూ.370 కోట్లు కొట్టేసిన చంద్రబాబు జైలులో కాకుండా ఎక్కడ ఉంటారని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన స్కాంను కప్పి పుచ్చి సానుభూతి పొందేందుకు టీడీపీ నాయకులు ఆపసోపాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ నేతల విమర్శలకు భయపడేది లేదని, ఆ దమ్ము, ధైర్యం సీఎం జగన్, ఆ భగవంతుడు తనకు ఇచ్చారని అనిల్‌కుమార్ తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై మాత్రమే తాను దృష్టి సారించానని, రాజకీయాలు చేయాల్సిన సమయంలో మాత్రమే చేస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, బ్యాంకు అధ్యక్షుడు చాగంటి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఆళ్ల చంద్రిక, ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ రాఘవరావు, మాజీ ఎంపీపీ పుచ్చకాయల గనోజమ్మ పాల్గొన్నారు.

ఆర్‌బీకేలలో ఈ క్రాప్ ముసాయిదా జాబితాల ప్రదర్శన

పెడన: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాలను ప్రదర్శిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 4,13,413 ఎకరాలలో పంటల సాగు, ఈ క్రాప్ పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది ఈ క్రాప్‌కు సంబంధించిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీల కోసం రైతు భరోసా కేంద్రాలలో ఉంచుతామని తెలిపారు. నాలుగు రోజుల పాటు గ్రామ సభలు జరుగుతాయని, ఈ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత వీఏఏ, ఎంపీఈఓ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి లిఖిత పూర్వకంగా అభ్యంతరాలను తెలియజేయవచ్చన్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామ సభలు

చల్లపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పనులు గుర్తించి ఆమోదించేందుకు గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు తెలిపారు. 26న పురిటిగడ్డ, 27న వక్కలగడ్డ, 30న వెలువోలు, యార్లగడ్డ, 31న నడకుదురు, నవంబర్ 2న చల్లపల్లి, 3న పాగోలు, 4న లక్ష్మీపురం, 6న మంగళాపురం, 8న మాజేరు, 10న ఆముదార్లంకల్లో గ్రామసభలు జరుగుతాయని వివరించారు.